నాన్నారు ఎప్పుడొస్తారు?

సి. కనకాంబర రాజు

"అమ్మా, నాన్నారు ఎప్పుడొస్తారమ్మా?"

"ఇవ్వాళే...., సాయంత్రానికల్లా వచ్చేస్తారు. నీకు పూర్ణించి మిఠాయిలు, పుస్తకాలు, బొమ్మలు...."

"రైలుబండి, లక్కపిడతలు అన్నీ తెస్తారు కదూ ? పో అమ్మా ..., నువ్వేమీ చెప్పక్కర్లేదు. నాన్నగారేం యివ్వాళ రారు. నాకు అవన్నీ తేనూ తేరు. రోజూ నువ్వు ఇలానే చెబుతుంటావ్. అయినా ఒక్కరోజూ కూడా నీమాట నిజంకాలేదు. నువ్వు వట్టి అబద్ధాలమ్మవు. అంతా అబద్ధం. నీ మాటలన్నీ అబద్ధం. నాన్నారు రారు. నిజం చెప్పమ్మా. రారు కదూ ...?"

నాలుగో యేడు ప్రవేశిస్తున్న చిన్నారి పాపాయి 'సుమ' పదే పదే అడిగే యిలాంటి ప్రశ్నకు 'సుందరి' ఏం సమాధానం చెప్పగల్గుతుంది ? ఏమీ చెప్పలేదు నోటితో ఏమీ చెప్పలేదు. నిజాన్ని వప్పేసుకున్నట్టుగా కంట తడి పెడుతుంది. కాగా, తన బంగారు తల్లి సుమను హృదయానికి హత్తుకొని, ఆ హాయిలో అనిర్వచనీయమైన ఆనందాన్ని త్రుటికాలం అనుభవిస్తుంది. ఆ తృప్తితోనే ఆమె జీవితం నెట్టబడుతోంది.

సుమ అడిగిందానికి సమాధానంగా తోచి వది చెప్పడం, ఆశ చూపించడం, మభ్యపెట్టడం. ఇలా వూహ తెలిసినప్పటి నుంచి సుమ అడుగుతోనే ఉంది. సుందరి చెబుతూనే ఉంది.

సుందరి హృదయాలింగనంలోంచి తెప్పరిల్లింది సుమ.

"అమ్మా, చెప్పమ్మా నాన్నారు ఎప్పుడొస్తారు ?"

పాప ఏమరలేదు. మళ్లీ గుర్తు తెచ్చుకుని అదే ప్రశ్న అడుగుతోంది.

"చూడమ్మా, డబ్బాలో చాక్లెట్లున్నాయి. అందులో మూడో నాలుగో నువు తీసుకుని నాకోటి తెచ్చిపెట్టు."

"నష్కు నాకు చాక్లెట్లు. అవి వద్దంటే నువ్విస్తాననే డబ్బులు కూడా నా కొద్దు. నాకేమీ వద్దు. నాకు నాన్నగారు కావాలి. నువ్వసలు మంచిదానివి కాదు. నాన్నారు వచ్చిం తర్వాత— నీవని చెబుతా నుండు. నాన్నా, నాన్నా .... అమ్మ వట్టి అబద్ధాలకోరు. అన్నీ అబద్ధాలే చెబుతుంది. మనం అమ్మతో 'కట్టి' చేద్దాం. అస్సలు మాట్లాడనే వద్దు. అని చెప్పేస్తా...."

"అలానేలేమ్మా ..., అలానే చెబుదూ గాని. నువ్వు లే ..., లేచి బెబ్బేసుకుని అన్నం తిందువుగాని రా. ఆకలవడం లేదూ ....?"

"నాకేం ఆకలవడంలేదు. ఇవ్వాళ నాన్నారిని చూడకుండా అసలు నేనేమీ ముట్టేదే లేదు. నీకైతే మా నాన్నారు లేకపోయినా ఫరవాలేదు. నీ కున్నారు గనక. అప్పుడప్పుడు వస్తుంటారు గనుక. నీకేం ఎంచక్కా ఉండొచ్చు. మరి నేనలా కాదే .? నాకూ మా నాన్నారు కూడా కనిపిస్తూ ఉంటే నేనూ నీలాగే ఉందును."

వయస్సుకు తగని తెలివితో మాట్లాడే పాపనే చూస్తోంది సుందరి పాపకు ఎన్నో ప్రశ్నలు. అన్ని ప్రశ్నలు తండ్రిని గురించే. సుమ పితృప్రేమకు నిరుత్తరురాలై పోతోంది.

అమ్మ స్థితి పాపకు తెలియదు. అక్కరలేదు కూడాను. తన మాటలు అమ్మను బాధిస్తున్నాయి, తన ప్రశ్నలు శూలాలు దిగేస్తున్నాయి అని పాపకు తెలియదు పాపకు కావాల్సింది నాన్న. ఆ నాన్న కనిపించేవరకు, అతని ఆదరణ పొందే వరకు పాప యిలానే వేధిస్తూంది.

పాపను తండ్రి ఆలననుంచి తప్పిద్దామని అనేకవిధాల ప్రయత్నిస్తుంది సుందరి

ఇలా ఎన్నో రోజులు గడిచిపోయినయ్. అయినా పాప ప్రశ్నకు సమాధానం లేదు అమ్మ యిచ్చే సమాధానమే ఉంది గాని, బుజువర్తనమైన సమాధానం లేదు. దాని కోసమే తపించి పోతోంది పాప.

సుమ రానురాను అమ్మ మాటల్లో నమ్మకాన్ని కోల్పోతోంది. అమ్మమీద కోపగించుకుంటూ ఉంది కూడాను.

సుమ ఈరోజు సుందరిని విడిచి పెట్టేలా లేదు.

"చూడమ్మా పాపా, అదిగో సంధ్య పిలుస్తున్నట్టుంది. ఆడుకోడానికి రమ్మంటోంది. వెళమ్మా."

"ఏం పిలవడంలేదు. పిలిచినా వెళ్లేది లేదు. మా 'నాన్నారిని చూశాక ఆడుకోడానికి వస్తాను పో' అనేస్తాను.

"తప్పమ్మా .., స్నేహితురాళ్ళని అలా గసురుకోవచ్చా ? ఎంచక్కా కలసి మెలసి ఆడుకోవాలి. తెలిసిందా ? వెళ్ళు వాళ్లింట్లో రైలుబండి ఉంది కదూ ?"

"ఉండమ్మా నువ్వు మరీని. వీళ్ళసలు మంచోళ్లు కాదమ్మా, మొన్న సరూ ఏమందో తెలుసా? సుమకు అమ్మే గాని నాన్న లేరే అంది. అని అందరితోనూ చెబుతోంది. అప్పుడేమో నే ననాను, పోవే మా నాన్నారు వూరెళ్లారు. ఇవ్వాళ సాయంత్రం వస్తారు. మా అమ్మ చెప్పింది. అన్నాను.వాళ్లు వాళ్లు ఒకటే నవ్వులూ, వేళాకోళాలూను. నువ్వు చెప్పిన మాటలు నేనే కాదమ్మా, వాళ్లు కూడా నమ్మరు మా అమ్మ అబద్ధం చెప్పదు పొండి అన్నాను వాళ్ళు వింటేనా ? 'నీ కసలు నాన్న లేరు ఉంటే చూపించు' అంటూ ఒకటే గోల. నేను కోపగించుకుని వచ్చేస్తుంటే నా వెనక్కాల పడ్డారమ్మా. పిళ్ల నసలు దగ్గరకు రానీయకూడదు. వాళ్లు మంచివాళ్ళు కాదు. కదమ్మా ., చెప్పమ్మా. .., ఎందుకమ్మా నాన్నారి గురించి అడిగినప్పుడల్లా నీ కళ్లల్లో నీళ్లొస్తాయి ? ఏడిస్తేనే కదమ్మా కళ్లల్లో నీళ్లొస్తాయి ? నువ్వు ఏడుస్తున్నావా అమ్మా నువ్వెందు కేడవాలమ్మా ? నాన్నారు ఇవ్వాళ వస్తారని నువ్వే కదా చెప్పావు ఇంక ఏడుపెందుకమ్మా ? నేను అల్లరి చేస్తున్నానని కోప మొచ్చిందా ? నేను అల్లరిచేస్తూ ఉంటానూ—, చెప్పిన మాట వినను అని సరూ వాళ్లమ్మలాగ నాన్నారితో చెబుతావా ? చెబుతావా అమ్మా ? చెప్పమ్మా ? నాన్నారు నన్ను కొప్పడుతారు.

కోప్పడి నన్నసలు దగ్గరికే రానివ్వరు. నాన్నారేమో రాకరాక ఎన్నాళ్ళికో వస్తున్నారాయె. వచ్చి రాగానే నువ్వేమో పాప అల్లరి చేస్తోంది అని చెప్పేస్తావు కాబోలు! అమ్మ బాబో, అయితే నాన్నారు నన్ను ఎత్తుకోరు సంధ్యా వాళ్ల నాన్నారిలా ముద్దెట్టుకోరు మా అమ్మకదూ.... నువ్వు నాన్నారితో చెప్పకమ్మా.. ., చెప్పవు కదూ , మాట్లాడవేమమ్మా.... చెప్పవు కదూ . . వూ....?”

తల్లి గడ్డం పట్టుకుంది సుమ ప్రబతిమలాడుతున్నట్టు.

“పాపా...” అంటూ సుమను గట్టిగా గుండెలకు హత్తుకొని తన ఉద్వేగాన్ని, పరితాపాన్ని పాప పసిగట్టకుండా గుండెల్లోనే ఏడ్చుకుంది అమ్మ.

“అమ్మా.... మరే .... మరే .... నాన్నగారు ఏవూరమ్మా వెళ్త ?”

పాపకు ప్రశ్నలు తప్పితే పరిస్థితి అర్థంకాదు.

సుందరి మాట్లాళ్లేదు. మాట్లాళ్లేకపోయింది.

“మాట్లాడవేమమ్మా...., నువ్వు నాతో మాట్లాడవా....? నాన్నారు వచ్చేదాకానన్నా మాట్లాడమ్మా. ఆ తర్వాత మానేద్దువులే. ఇప్పుడే మానేస్తే యిక నాతో మాట్లాడేవా రెవరుంటా రింక ?”

“మాట్లాడతానమ్మా .... మాట్లాడతాను. చెప్పు. ఏమిటన్నావు ?” ఆవేదన్ని దిగమింగింది సుందరి.

“నీ కంట్లో ఏదన్నా పడిందామ్మా ఎన్నెన్ని నీళ్ళొస్తున్నాయా చూడు.”

చిట్టి చిట్టి చేతులతో తల్లి కన్నీళ్ళు తుడిచింది సుమ.

పాపను మరల్చాలని _ వృధా ప్రయాస పడుతోంది సుందరి. పాపను మరల్చగల శక్తిని, ధైర్యాన్ని యిమ్మని లోలోన భగవంతుడ్ని వేడుకొంటూ ఉంది.

“ఏమ్మా ... నాన్నారు ఏవూరెళ్లారు? నాకోసం కాదమ్మా. అందరూ అడుగుతున్నారు పిల్లలే కాదమ్మా, పెద్దవాళ్ళు కూడాను ఈ బామ్మల కసలు బుద్ధుండదమ్మా. వాళ్ళు మరీను. నేనేమో చిన్న పిల్లనా, పెద్ద పెద్ద మాటలు నాకేం తెలుస్తాయి చెప్పమ్మా. మొన్నటికి మొన్న ఎదురింటి బామ్మగారు అందీ ., పాపా మీ నాన్నగారు ఎప్పుడొస్తారు అని. నే నన్నాను ఇవ్వాళ వస్తారు అని. అప్పుడేమో ఎక్కడి కెళ్లారు అని, ఎందు కెళ్లారు అంటూ ఎన్నడిగిందని ? నే ననేశాను. బామ్మగారూ, మీకు బుద్ధిలేదూ అని. నాకు బలే కోపమొచ్చింది లేమ్మా మరి. బుద్ధి లేకపోవడమంటే విషయాలు తెలియక పోవడమని నువ్వు చెప్పావుగా. అందుకే అలా అనేశాను. ‘బామ్మగారూ మీకు బుద్ధిలేదూ ...., నేనేమో చిన్నపిల్లను. నాకు చిన్న తలకాయ ఉంది. ఇంకా బళ్ళోకన్నా వెళ్లలేదు. మీరు నాకంటే ఎంతో పెద్దోళ్ళు గనుక మీకే ముందు తెలిసి ఉండాల్సింది. మా నాన్నారు ఎక్కడికెళ్లారు, ఎందు కెళ్లారు—ఇవి తెలియక పోతే మీ కసలు బుద్ధి లేదన్నమాటే’ అన్నాను. ఆవిడ నన్ను తిట్టిందమ్మా. ‘రాలుగాయిపిల్లా, ఉండు మీ అమ్మతో

చెబుతా నుండు. ముదనష్టపుదానా' అంటూ తిట్టిందమ్మా. నేనన్న దానిలో తప్పుందమ్మా ? బామ్మగారి కంటే నేనే నయమమ్మా. యింకా నేను బుద్ధున్నదాన్నవ్వాలంటే అన్నీ తెలుసుకోవాలి. కదమ్మా.... నాన్నారు ఎక్కడి కెళ్ళారు...., ఎందు కెళ్ళారు...."

ఎక్కడినుంచి వస్తున్నాయో యీ మాటలన్నీ గుక్కతిప్పకుండా మాట్లాడేస్తోంది సుమ.

ఇది చిన్నపిల్లేనా ? ఇంతింత తెలివితేటలు దీని కెలా వచ్చాయి అని అలానే పాపాయిని కనురెప్పలు మూయకుండా చూస్తూ ఉంది సుందరి.

అమ్మ పరధ్యాన్నంగా ఉన్నట్టు గ్రహించి కదిలించింది సుమ.

"చెప్పమ్మా...నాన్నారు ఎక్కడికెళ్ళారు?"

ఏదో చెప్పాలి తప్పదు.

"హైదరాబాదమ్మా."

"హై ద రా బా ద మ్మా, ఎ క్క డ ఉందమ్మా ?"

"హైదరాబాదమ్మా కాదు. హైదరాబాదు."

నాన్నారు...

"పూఁ .... అదేలే. అదెక్కడ ఉంది ? బామ్మలాంటివాళ్ళు ఇలానే అడుగుతారమ్మా. ఆమాత్రం కూడా తెలియదేమో వాళ్ళకి? హయిదరాబాదు ఎక్కడుంటుంది? హయిదరాబాదులోనే ఉంటుంది. ఇదే తెలియదు వాళ్ళకు."

చిన్నారి చేతులొత్తి అభినయిస్తోంది సుమ.

"అవునమ్మా, నిజమే. వాళ్ళకేం తెలియదు."

"నాన్నారు అక్కడి కెందు కెళ్ళారమ్మా ?

" . . . . . . "

"చెప్పమ్మా....."

"నాన్నారూ .... నాన్నారు ... హైద్రాబాదు.... ఎందు కెళ్ళారంటే...., ఆఁ... . నీకు మిఠాయిలు తెద్దామని."

"పోమ్మా.. .., నువ్వూ బామ్మలాంటి దానివే. ఎక్కడైనా మిఠాయిలు కోసం హైదరాబాదు వెళ్తారేంటి ?"

"ఏమో మరి .... ఏమో .... నాతో అలా చెప్పారు. మన బంగారు తల్లికి యిక్కడి మిఠాయిలు తినిపించకూడదు, హైద్రాబాదు నుంచి పట్టుకురావాలి అని చెప్పి అక్కడికి వెళ్ళారు."

"అవునమ్మా...., నేనంటే నాన్నారికి అంత యిష్టమా ? అలాగని నీకు ఉత్తరాల్లో రాస్తున్నారా అమ్మా ...? ఏమ్మా నాన్నారు ఎప్పుడొస్తారు ? వచ్చి రాంగానే నేను చెప్పేస్తాను —నాన్నారూ నాకు మిఠాయిలు కోసం మీరు హయిదరాబాదు వెళ్ళకండి, నాకు మిఠాయిలు వద్దు, ఏమీ వద్దు. మీరు ఇంటి దగ్గరే ఉండండి. నేను మీతో ఆడుకుంటాను. అని చెప్తేస్తాను."

"సరే అలాగే చెబుదూగాని. లే అన్నం తిందువుగాని."

"వద్దమ్మా నాకసలు ఆకలే లేదుగా. ఏమిటోగాని నాన్నారి గురించి మాట్లాడుకుంటే నాకసలు ఆకలే వేయదమ్మా. నీకూ అంతే కదమ్మా. మీనాన్నారు వస్తే నువ్వూ అన్నం తినవు కదూ.....?"

"అవును."

"చూడమ్మా...., పక్కింటి విశాల లేదూ...అదే.. మొన్న నా రిబ్బను ఎత్తుకుపోయిందే అది. అదేమో వాళ్ళ నాన్నగారి నెపుడూ తిడుతూ వుంటుంది. మా అందరితో వాళ్ళ నాన్నారి మీద నేరాలు చెబుతూ వుంటుంది, వాళ్ళ నాన్నారు ఏం మంచివారు కాదట. సినిమాలకు తీసుకువెళ్ళరట.. మిఠాయిలు తెచ్చి పెట్టరంట. 'చెప్పమ్మా... మిఠాయిలు తెచ్చి పెట్టకపోతే నాన్నారు మంచివారు కాపోతారా? ఛీ .విశాల మంచిది కాదు కదమ్మా. ..?"

"అవునమ్మా....అవును."

"అదేంటమ్మా.. పిన్నిగారు బాబాయిగారితో ఎప్పుడూ తగువులాడుతూ వుంటుంది. నువ్వూ నాన్నారితో పేచీ పెట్టుకుంటావా అమ్మా...? కాదుకదూ. మా అమ్మ చాలామంచిది. మా నాన్నారితో అస్సలు పోట్లాడనే పోట్లాడదు. కదమ్మా ."

సుందరి మొహాన్ని చేతులొత్తి రాస్తూ అంది సుమ.

సుందరి ఏం మాట్లాడదు వింటుంది. అంతే

"పరూ...వాళ్ళ నాన్నను చూశావు



కదమ్మా. సాయంత్రం యింటికి వస్తారంట...వచ్చీరాంగానే వాళ్ళమ్మను పట్టుకుని కొడతారంట. తిడతారంటమ్మా. మన నాన్నారు కూడా అలానే చేస్తారామ్మా...? కాదు కదమ్మా...నాన్నారు విన్నేమీ అనరు కదూ...? నవ్వుతూ మాట్లాడుతూ... వుంటారు కదూ.?"

"సంధ్య చెప్పిందమ్మా...వాళ్ళ నాన్నారు వాళ్ళమ్మను ఏమీ అనరట. అసలు ఆయనకు కోపమే రాదట. వాళ్ళమ్మ ఏమడిగినా తెచ్చిస్తారట. సంధ్యకు కూడా అంతే. మొన్న సంధ్యేమో కీయిచ్చే ఆడుకునే రైలు కావాలంది. అంతే సాయంత్రానికల్లా తెచ్చిపెట్టారు. ఆ రైలు ఎంత బావుందను కున్నావమ్మా...? రెండు పట్టాలుంటాయి.

ఎంత వ్యత్యాసమో! మెరయుచుండే తెలుపు! నిష్కళంకమైన శుభ్రత! ఇది యెల్లప్పుడూ కొలదీ నురగ గల సర్ఫ్ యొక్క ఉతికే అధిక శక్తివల్లనే. మీ ఉతుకును చాలా సులభం చేస్తుంది. మీ బట్టలన్నిటినీ ఉతుకుటకు సర్ఫ్‌ను వాడండి ... పిల్లల బట్టలు, షర్టులు, చీరలు, ప్రతిదీ. సర్ఫ్‌తో ఇంట్లో ఉతుకోండి!

సర్ఫ్ అమిత తెల్లగా ఉతుకును

SU. 45-140 TE. హిందుస్థాన్ లీవర్ ఉత్పత్తి

తాని మీద రైలు పరుగెడుతూ పోతుంది. ఆ రైలు అలా పరుగెడుతూ కూత పెడుతుంది. సంధ్య 'కూ' అని కూత పెడుతుంది. భలే సరదాగా వుంటుంది లేమ్మా. నాన్నారితో చెప్పి నాక్కూడా అలాంటిది తెప్పించుకుంటాను. తెచ్చిస్తారు కదమ్మా. నువ్వు కూడా చెబుతావు కదమ్మా. అమ్మా...మరే....మరి నాన్నారు ఇవ్వాళ రాకపోతే మనమే హైదరాబాదు వెళ్ళిపోతే? అమ్మా వెళ్దామామ్మా...?

చీర చెంగుతో కళ్ళు తుడుచుకుంది సుందరి.

"అదేంటమ్మా..నీ చీర చిరిగిపోయింది, వుండు, నాన్నారు రానియ్. నీకో వంద చీరలు, నాకో ముప్ఫైఏడు గౌనులు తెచ్చేస్తాము. సరేనామ్మా..., నువ్వింక చిరిగిపోయిన చీరలు కట్టుకోవక్కర్లేదు, నేనూ సంధ్యలాగా రోజుకో గౌను వేసుకోవచ్చు."

"అలాగే లేమ్మా........"

"అమ్మా, నాన్నారు రావడం చూచి నాకు చెప్పమ్మా..., నేను దాక్కుంటాను. అప్పుడు నాన్నారు వచ్చేస్తారు. వచ్చేసి, ఏదీ, మన పాపేదీ అని అడుగుతారు. నువ్వు పాప చచ్చిపోయిందీ....."

"పాపా..."కౌగిలించి గట్టిగా బంధించింది. పాప నోటిని చేత్తో మూస్తూ సుందరి.

"వెళ్ళమ్మా వెళ్ళు. సంధ్యా వాళ్ళింటికి వెళ్ళి రైలుతో ఆడుకో, వెళ్ళు." అంది.

"రైలుతో ఆడుకోవడం నాకూ ఇష్టమేనమ్మా..., కాని, వాళ్ళమ్మ నన్ను అడుగుతుందమ్మా. నిన్న మా నాన్నారు వస్తారు అని చెప్పేశాను. నాన్నారు రానే లేదుగా. ఇవ్వాళ అడిగితే ఏమని చెప్పాలి? అందుకని..."

"పోనీలే నువ్వు ఎక్కడికీ వెళ్ళొద్దు. మనం యివ్వాళ అలా గార్డెనుకు వెళ్దాం. నువ్వు తొందరగా అన్నం తినేయ్. రా అన్నం పెడతాను."

"వద్దమ్మా మనం గార్డెనుకు వెళ్ళొద్దు. మనం గార్డెనుకు వెళ్ళాక తర్వాత నాన్నారు వచ్చి మళ్ళీ వెళ్ళిపోతారు? అందుకే మనం ఎక్కడికీ వెళ్ళనే వద్దు. ఇక్కడే వుందాం."

"నువ్వు అన్నం తినరాదూ..., అన్నం తినకపోతే నీకు ఆకలేస్తుంది. ఆకలేస్తే

నాన్నారు...

సన్నంగా రామ్మూర్తిగారి 'మీనూ'లా అయిపోతావు. అప్పుడు నాన్నారు వచ్చి ఇదేమిటి మన పాప యిలా అయిపోయిందేమిటి? నువ్వు అన్నం పెట్టడంలేదా, అని నన్ను తిడతారు. కోపం వచ్చేస్తుంది నాన్నారికి...."

"వద్దమ్మా వద్దు. నాన్నారికి కోపం రప్పించకూడదు. అన్నం కలిపి తీసుకురా. ఇక్కడే తింటాను."

"హమ్మయ్యా." అనుకుంటూ సుందరి అన్నం కలిపి తీసుకు వచ్చి ఒక్కోముద్దను తినిపిస్తోంది.

"అమ్మా..." పాప సంశయం సుందరికి తెలుసు. అందుకే అన్నం ముద్ద సుమ నోటికి అడ్డంపెట్టింది.

"అన్నం తినేప్పుడు మాట్లాడకూడదమ్మా. అన్నం తినేయ్. తర్వాత మాట్లాడుదువుగాని....."

"పోమ్మా...., నువ్వెప్పుడూ అంతే. అన్నం అన్నమే. మాటలు మాటలే."

"అలా అనకూడదమ్మా...., నాన్నారికి కోపం వస్తుంది."

"ఏంరాదు పో. నాన్నారి గురించి మాట్లాడుకుంటే నాన్నారు ఏమీ అనరు. అది సరే.., మరి నాన్నారు ఎక్కడ అన్నం తింటారు?"

"హోటల్లో."

"హోటల్లో వాళ్ళమ్ముందా?"

"ఛ..., వాళ్ళమ్మ హోటల్లో ఎందుకుంటుంది?"

"మరి అమ్మే కదమ్మా అన్నం పెట్టేది?"

"సంధ్యా వాళ్ళ నాన్నగార్కి, ఆ నాన్నగారి అమ్మ అన్నం పెడుతుందా ఏం?"

"సంధ్యా వాళ్ళమ్మ పెడుతుంది. అయితే నాన్నారికి నువు అన్నం పెట్టాలి. నువ్వేమో యిక్కడే వున్నావమ్మే. ఇంక నాన్నారు అన్నం తినేది ఎలా?"

"నాకు తెలియదులేమ్మా... నీకు నేను సమాధానం చెప్పలేను. నాన్నారు వచ్చిం తర్వాత ఆయన్నే అడుగు. ఆయనే చెబుతారు."

"అయితే సరే..., ఇంకొద్దమ్మా, ఆకలిగా లేదు......"

"ఒక్కముద్ద తినమ్మా..., లేకపోతే ఆకలేస్తుంది. తినమ్మా...నా బంగారు కొండ కదూ.....!"

"వద్దమ్మా...వద్దు. నువ్వు చేతులు కడుక్కుని రా. నాన్నారి సంగతులు చెప్పుకుందాం. సంధ్యా వాళ్ళమ్మా యిద్దరు ఇంచక్కా చెప్పుకుంటారమ్మా. వాళ్ళ నాన్నారు పొద్దున్నే ఎక్కడికో వెళ్ళిపోతారా, మళ్ళీ సాయంత్రం వచ్చేదాకా ఒకటే కబుర్లనుకో. నేనూ అక్కడే కూర్చుని వింటూ వుంటాను. నాకు తెలుసునో లేదో, సంధ్యా వాళ్ళ నాన్నారు సాయంత్రం వచ్చీరాంగానే సంధ్యను ఎత్తుకుని ఎన్ని ముద్దులు పెట్టుకుంటారనుకున్నావ్..., నన్నూ దగ్గిరికి రమ్మంటారు. నాకు భలే సిగ్గేస్తుంది. పరుగెట్టుకొచ్చేస్తాను."

"అమ్మా, పాపా నువు అన్నం తిన్నావుగా అలా పోయి ఆడుకు రా. నాకు నిద్రొస్తోంది. వెళ్ళమ్మా సంధ్యా వాళ్ళింటికెళ్ళి వాళ్ళ నాన్నారి కబుర్లు విను."

"వద్దమ్మా ఇవ్వాళ నేనెక్కడికీ వెళ్ళను. నువ్వు నిద్రపోవద్దు. నాన్నగారేమో కాస్సేపటికో కూస్సేపటికో వచ్చేస్తారు, నువ్వు నిద్రపోతావా? భలే మంచిదానివేనే.. వుండు, వీధిలోకెళ్ళి నాన్నారు వస్తున్నారేమో చూసొస్తాను."

పరుగెత్తుకెళ్ళి, చేతిలో ఒక కవరుతో తిరిగి వచ్చింది సుమ.

కవరు తల్లి చేతికిచ్చి,

"బళ్ళో పిలక మాస్టారు ఇచ్చారమ్మా" అంది.

"తప్పమ్మా ఆయన్ను అలా పిలవకూడదు. ఆయన మన పూరి పోస్టు మాస్టారు."

"ఏమిటది....? పోగను ... ఏమిటో లే. అంతంత మాటలు నాకెలా వస్తాయి? ఉత్తరం ఎవరు వ్రాశారమ్మా.. నాన్నారేనా?"

"అవును."

"ఏమని వ్రాశారు? ఇవ్వాళ సాయంత్రం వస్తున్నాను, ఎక్కడికీ వెళ్ళొద్దు, యింటి దగ్గరే వుండండి, వంద చీరలు, డబ్భైయి గౌనులు తెస్తున్నాను అని వ్రాశారా?

ఏమ్మా...?

"అవునమ్మా అవును. అన్నీ తెస్తారుట. కాని, ఇవ్వాళ రావడంలేదట. రేపు వస్తారట."

"........................."

"పాపా, రేపు వస్తారటమ్మా...."

"అ..యి..తే..ఇవ్వాళ రా...రా...? నన్ను వచ్చేరాంగానే ఎత్తుకోరా?"

ఎలా సమాధాన పరచాలో తెలియక తిక మక పడిపోతోంది సుందరి.

తనకు ఇంత తెలివైన కూతురు నెందు కివ్వాలి? అని దేవుడి నడుగుతోంది.

సుమ తన తల్లిని యిలా అడగడం కొత్తకాదు. ఇలా వేధించడం, నేపుకు తినడం ఇదే ప్రథమంకాదు. ప్రశ్నల వర్షానికి అలవాటై తడుస్తున్న తల్లి నిత్యం అనుభవించే మనోవ్యధ పాపకు తెలియదు. పాపం తండ్రంటే పడిచస్తుంది. తండ్రి ఆదరణ ఎలా వుంటుందో ఎరుగదు. అందు కనే పొరుగిళ్లకు పోయి సహజసిద్ధమైన వికసిత జ్ఞానంతో పసిగట్టి, తాను కూడా అటువంటి అనుభూతుల్ని పొందగలిగితే ఎంత ఆనందంగా వుంటుంది? అలానే వూహించుకుంటూ తల్లి దగ్గరికి వచ్చి చూపించి విన్నదీ అంతా ఏకరువు పెడు తుంది. విషాన్ని మింగిన ఆతల్లి చిరు చేదుల్ని రుచి చూడ్డంతో ఏమంత కలత పొందదు. అలవాటైపోయింది. అందు కనే, కూతురు ప్రశ్నలకు సాధ్యమైనంత దగ్గరలో నమ్మేట్టు కల్పించి సమాధానం చెబుతూ వుంటుంది. సుమ సామాన్య మైంది కాదు. చాల అసాధ్యురాలు. ఇట్టే పసి గట్టేస్తుంది.

తనకూ సుమలాంటి కోర్కెలు వున్నాయి. తనూ తన భర్త కోసం ఎదురు చూస్తు వుంటుంది. ఎదురు చూడ్డం అనవసరం అని బాగా తెలుసు. అయినా ఏదో ఆశ. అలానే కాలం గడుపుతోంది. కనీసం సుమ ఐనా సంతోషపడుతుందని తాను నిగ్ర హించు కొంటోంది. బాధను మింగుతోంది. అగ్నిని జీర్ణం చేసుకుంటోంది.

సుమను తండ్రి ధ్యానం నుంచి తప్పిద్దా మని శతవిధాలా ప్రయత్నిస్తోంది. కాని

ఏం ప్రయోజనం?

పిల్లలు తల్లిదండ్రుల ప్రేమను ఆశిం చడంలో తప్పేమీ లేదు. దూరంగా వుంటు న్నప్పుడు ఆప్రేమ మరింత బలంగా ఏర్పడు తుంది.

సుందరికి ఒకటే బాధ. తన కూతుర్ని, తన ప్రాణానికి ప్రాణమైన బంగారుతల్లి, ఇలా తండ్రి కోసం తపించిపోతోంది కదా, ముందుముందు ఎలాంటి దారుణం జరుగు తోందని భయపడిపోతోంది. రానురాను తండ్రి పైన అలని సుమకు ఎక్కువవు తుందేగాని తాను ఆశించినట్లు ఏమాత్రం తరగడంలేదు.

ఉత్తరాలు తండ్రి దగ్గరి నుంచి వస్తు న్నట్లు తానే వ్రాసి పోస్టు చేస్తూ వుం టుంది. సుమను నమ్మిద్దామనే ప్రయత్నం ఇది. ఇలా ఎంతకాలం? ఒకోసారి అను కుంటుంది సుందరి—తాను సుమకు అనర్థ మైన ఆశలు కల్పించానని. కాని, ఆ ఆశ లేకపోతే సుమ కోసం తను బ్రతకలేదు. కల్పనాప్రపంచమే తనకు ప్రోత్సాహమిస్తూ వుంది.

"అమ్మా మరి నాన్నారి పేరేమిటమ్మా.?"

ఎప్పుడూ అడగని ప్రశ్న—

"నాన్నారే..."

"అది కాదమ్మా నాన్నారు సరే..., అసలు పేరు. నన్ను సుమా అని అప్పుడప్పుడు నువు పిలుస్తుంటావే....అలాంటిది నాన్నా రికి లేదా?"

అనామకుడు కాదు తన భర్త. అందుకే యీసారి అబద్ధం చెప్పలేకపోయింది.

"ఏం పేరమ్మా... చెప్పవూ?"

తన భర్త పేరు చెప్పకూడదు అని పాపకు తెలియదు. తెలియజెప్పినా వినదు. అందుకే చెప్పేసింది.



సత్యకీర్తి.

"సత్యకీర్తి భలే పేరు." భలే పేరు సత్యకీర్తి మానాన్నరి పేరు." అంట గెంతింది ఆనందంతో సుమ.

"అమ్మా....మరే...."

"చూడమ్మా తల్లీ...నేను చెప్పినట్లు వింటావా అల్లరి చేస్తావా?"

"నేను అల్లరి చేస్తానా అమ్మా....?" ఉత్సాహం పోగొట్టుకుని బిక్కుబిక్కు మంటూ చూస్తోంది సుమ.

సుమ అల్లరి చెయ్యదని సుందరికి తెలుసు.

"అది కాదమ్మా, చూడు నీకో మంచి కథ చెప్పనా....?"

నాన్నగారి మాటల నుంచి తప్పించడానికి అంతకన్నా వేరు మార్గం యికలేదు.

ఇష్టం లేకపోయినా, అమ్మ చెప్పే కథలు బావుంటాయి గనక అయిష్టంగానే ఒప్పు కుంది సుమ.

ఈ ఆలోచన ముందుగానే రానందుకు తన్ను తాను తిట్టుకుని, ఇప్పటికైనా వచ్చి నందుకు, కలుగజేసినందుకు భగవంతునికి ధన్యవాదాలర్పిస్తూ మొదలెట్టింది సుందరి.

"—ఒక మహారాజు గారున్నారు. ఆ మహారాజుగారికో అమ్మాయి వుంది. అచ్చు అందాల బొమ్మ. ఏజంత అందమైంది. చక్కనైందీను. రాజుగారు కూతుర్ని ఎంతో గారాబంగా పెంచుకుంటున్నారు. మరెవరూ సంతానం లేదు గనక కంటికి రెప్పలా కాపాడుకొంటూ వున్నారు. ఇంకేం ఆ రాకుమార్తె ఆడింది ఆట. పాడింది పాట. ఎప్పుడూ ఎంతో ఆనందంగా వుం డేది. రాకుమార్తె చాలా దయాళువు. ఎవ్వళ్లన్నా బాధ పడుతుంటే చూచి ఓర్చుకో లేకపోయేది. వెంటనే వాళ్లకు తగిన సత్కా రాలు చేసి సంతోషపెట్టి పంపిస్తూ వుండేది."

"నువ్వు మొన్న బుద్ధుడి కథ చెప్పావే... అందులో బుద్ధుడి లాగన్నమాట...."

"అవును. అచ్చం అలానే. సొంతం విను. అయితే, ఆ అమ్మాయికి కూడా చదువు కావాలిగా మరి..., అంచేత రాజుగారు ఒక గురువుగార్ని పెట్టారు. ఆ గురువుగారి

దగ్గర చదువుకుంటున్న మరో రాజకుమారుడు ఈ రాకుమార్తెను చూసి ప్రేమించాడు."

"అంటే.."

"తర్వాత చెప్తాను. ముందు కథ విను. ఆ....అప్పుడు ఇద్దరూ పెళ్లి చేసుకోవాలి అనుకున్నారు. అందుకు మహారాజుగారు ఒప్పుకోలేదు. రాకుమారుడన్నాడూ 'మనం వేరే రాజ్యం పోయి అక్కడ పెళ్లి చేసేసుకుందాం, మన బ్రతుకు మనం బ్రతుకుదాం' అన్నాడు. రాకుమార్తె అతడ్ని విడచి వుండలేకపోయింది. అందుకు సరే అంది. ఇద్దరూ మరో దేశం వెళ్లి అక్కడ పెళ్లి చేసేసుకున్నారు."

"భలే భలే.....!"

"అలా కొంతకాలం వున్నారు. ఎంతో హాయిగా వున్నారు. ఉద్యోగం చేసుకోవాలి అనుకున్నాడు రాకుమారుడు. ఆదేశం అప్పుడు చాలా అల్లకల్లోలంగా వుండేది. ఇతర రాజ్యాల వాళ్ళు వచ్చి ఆ రాజ్యాన్ని దోచుకుందామని చూస్తూ వుండేవారు."

"చైనా వాళ్లలా కదమ్మా...."

"ఊఁ...అలానే..., అది చూచి రాకుమారుడు సహించలేకపోయాడు. దేశరక్షణ కోసం శత్రువులతో పోరాటానికి వెళ్లాడు."

"మరి రాకుమార్తె ఒప్పుకుందామ్మా"

"రాకుమార్తె స్వయంగా అతన్ని తిలకం తీర్చి పంపించింది. పాపం ఆ సమయంలో ఆమె గర్భవతి కూడాను. అతను సైన్యంలో చేరి పోరాటం సాగిస్తున్న కాలంలో రాకుమార్తెకు పండంటి ఓ చక్కని కూతురు కల్గింది."

సుమను మరింత దగ్గరగా అదుముకుంది సుందరి.

"ఊఁ.....అప్పుడేమైంది?"

"ఈ విషయం రాకుమారుడికి తెలియజేస్తే ఎంతో సంతోషించాడు, తాను వెంటనే ఆ పాపాయిని చూడ్డానికి వస్తున్నానని టెలిగ్రాం యిచ్చాడు."

"అప్పుడు కూడా టెలిగ్రాంలున్నాయమ్మా..."

పొరపాటును గ్రహించింది సుందరి.

"అబ్బే అవార్త పావురం కాలుకి కట్టి పంపాడు. రాకుమార్తె అతని కోసం ఎదురు చూడసాగింది. ఇప్పుడొస్తాడు, మరి కాస్సేపటి కొస్తాడు అని ఎదురు తెన్నులు చూస్తు వుంది. అలా కనిపెట్టుకుని వున్న ఆమెకు పిడుగులాంటి వార్త చెవిని పడింది. రాకుమారుడు ప్రయాణించే విమానం కూలిపోయిందట."

"విమానాలున్నాయా....?"

ఏం చెప్పాలో తెలియక "వున్నాయి" అంది సుందరి. దుఃఖం ముంచుకొస్తు వుంది.

"రాకుమార్తె గుండె పగిలిపోయింది. ఆమె తండ్రి సంగతిని విని చూడ్డానికి వచ్చాడు. తన యింటికి తిరిగి రమ్మన్నాడు. మానుషవతియైన ఆ రాకుమార్తె రానూ' అంది. అయినా తండ్రి వస్తూపోతూనే వున్నాడు. బాగోగులు చూస్తూనే వున్నాడు. మనుమరాలితో ఆడుకుంటూనే వుంటాడు.

"తాతయ్యలా. కదమ్మా..."

"అవును. అయితే పాపాయి మాత్రం చాలా అల్లరిపిల్ల. తండ్రి గురించి రాకుమార్తెను ఎప్పుడూ అడుగుతూ వుంటుంది. తల్లి ఏదో సర్ది చెబుతూ వుంటుంది. కాని, ఆ పాపాయి నీలాగ చాల గడసరి. తల్లి మాటలు నమ్మదు. అస్తమానం నీ వడిగినట్టే నాన్నెప్పుడొస్తారు? అంటూ తల్లిని అదే పనిగా అడుగుతూ వుంటుంది. తల్లి మాత్రం లోపల్లోపలే ఏడ్చుకుంటూ కుమిలిపోతూ కూతురుకు తెలియకుండా చాటుగా గట్టిగా ఏడుస్తూ వుండేది. ఆ పాపాయి తండ్రిని గురించే ఎప్పుడూ అడుగుతూ ఆతల్లి బాధను మరింత ఎక్కువ చేస్తూ వుండేది."

"అమ్మా నేనైతే ఏంచేస్తానో తెలుసా?"

సుందరి కళ్ళ మెరిశాయి.

"ఆ...ఏం చేస్తావు?"

"అమ్మను ఓ ఒదారుస్తాను." అమ్మా, నాన్న పోతేపోయాడులే. నేనున్నాను కదా. నేను నీయంతయ్యాక, ఇప్పుడు నువు నన్ను ఎలా చూస్తున్నావో నిన్ను కూడా నేను అలాగే చూస్తాను. నీకెప్పుడూ బాధ కల్గించను....."

సుందరి ఆనందానికి అవధుల్లేవు. సుమను ముద్దుల్లో ముంచెత్తింది.

"అవునమ్మ రాకుమారుడు చచ్చిపోయాడంటావా?"

"నువ్వేమంటావు?"

"నాకైతే రాకుమారుడు చచ్చిపోయి వుండడనే అనిపిస్తోంది. ఎందుకంటే చచ్చిపోయిన రాకుమారుడ్ని రాకుమార్తె చూడలేదుగా మరి...., విమానం ఎక్కడో కూలిపోయి వుంటుంది. కొండల్లోనో అడవుల్లనూ తిరిగితిరిగి యింటి కొచ్చేస్తాడు. అప్పుడు పాపను చూస్తాడు. అంతే కదమ్మా......"

సుందరి ఎడమకన్నదరింది శుభశూచకంగా.

"నిజమామ్మా......నిజంగా వస్తారంటావా? నిజంగా యింటికి వస్తారంటావా? మా నాన్న......" తన్ను తాను సంబాళించుకుంది. ఆఖరిమాట మింగేసింది.

బిత్తరపోయింది సుమ.

"అది కథ కదమ్మా. పూర్వకాలంలో వచ్చేసివుంటాడు. ఇప్పుడు వాళ్లంతా చచ్చిపోయివుంటారు కూడా."

వింతగా కన్పించిన తల్లిని పరిశీలించి చూసి, ఏదో ఆలోచించింది. అంతలో సుధ అక్కడికి వచ్చింది.

"సుధ వచ్చిందమ్మా నేను ఆడుకోడానికి వెళ్లనా?"

ఇంతవరకు సుమ తన్ను విడిచివెళ్తేనే మంచిదనుకున్న సుందరి యిప్పుడు సుమ తన్ను విడచి వెళ్లేందుకు ఇష్టపడలేదు.

"వద్దమ్మా, ఇక్కడే కూర్చో, మీ నాన్నగారు వస్తారుగా."

"ఫో అమ్మా నువ్వెప్పుడూ అంతే. నేను యిప్పుడే వచ్చేస్తానుగా. ఈ లోపు నాన్నారువస్తే వచ్చిరాంగానే నన్ను పిలువ్వు. పరుగెత్తుకొస్తాను" అంటూ తుఃరువ పారిపోయింది సుమ.

తలగడలో తలదూర్చి దుఃఖభారం తొలగిపోయేవరకూ ఏడ్చింది సుందరి.

ఆ రాత్రి సుమ నిద్రలో కలవరింతలు

పెట్టడం మొదలెట్టింది—

"నాన్నారు చచ్చిపోయారా అమ్మా, నిజమేనా? నాకెందుకు అబద్ధం చెప్పావు? పోనీ లేమ్మా నే మున్నానుగా ఇప్పుడు నువ్వు నన్నిలా చూస్తూన్నావో ..... నీ యంత య్యాక......"

భయాందోళనతో పిచ్చిదానిలా ఐపోయింది సుందరి.

సుమవంటిమీద చెయ్యివేస్తే చెయ్యి కాలిపోతోంది. జ్వరం తీవ్రంగావుంది. పిలిచేందుకు డాక్టరు కూడా దగ్గర్లోలేడు. అలానే చెంతను కూర్చుని తడిగుడ్డతో ఉపశమనాన్ని కలుగజేస్తూ కళ్లల్లో వత్తులు పెట్టుకు చూస్తూవుంది.

సుమ ఉలిక్కిపడుతోంది. కలవరిస్తోంది.

సుందరి తన ఏడ్పును ఆపుకోలేక అవుకుంటూ సుమ పసిగట్టకుండా జాగ్రత్త పడుతూవుంది. తెల్లవారుజామువరకూ గడిచింది.

వీధి తలుపు చప్పుడైంది.

మొదటిసారి వినిపించకపోయినా, రెండవ సారి పిలుపులో తేరుకుని వెళ్లి తలుపు తీసింది.

ఎదురుగా నిలబడివున్న అతడ్ని దీపం వెల్తురులో పోల్చుకుని దిగ్భ్రాంతి చెందింది సుందరి.

"మీరు..... మీరు..... ."

"అవును సుందా నేనే......నేను బ్రతికే ఉన్నాను. ఏమిటలా చూస్తావ్.....? పాప ఏదీ? చూశావా? విమానం కూలిపోయింది మాదికాదు. మేమున్న విమానం శత్రువుల చేజిక్కింది యుద్ధ ఖైదీలుగా పట్టుబడ్డాం నీ మంగళసూత్రం ఎంత గట్టిదో చూడు. మన ప్రేమ ఎంత దృఢమైందో చూడు .... చచ్చి బ్రతికాను. అది సరే, తర్వాత మాట్లాడుకోవచ్చు. పాప ఏదీ. ముందు పాపను చూడాలి. చూపించు."

నిర్ఘాంతపోయి, అచేతనురాలైన సుందరిని సత్యకీర్తి కుదించేవరకు తెలివిలోకి రాలేదు.

వెంటనే భర్తను తీసుకుని పాప దగ్గరకు పరుగెత్తింది.

పాప మగతనిద్రలోవుంది. జ్వరతీవ్రతతో మొహం ఎంతో కళా విహీనంగావుంది.

"పాపా, నాన్నారు వచ్చారమ్మా...నాన్నారు వచ్చారు. నువ్వు చెప్పావుగా నాన్నారు వస్తారని..... .అలానే వచ్చేశారు. చూశావా. ..నీ పల్కులు ఎంత నిజమైనాయో .. నువ్వు దేవతవునుమా... .. నువ్వు దేవతవు."

పాపను నో కుదిపేస్తూ, పూగిం చేస్తూ తన్ను తాను మరచిపోయి సుమను అదేపనిగా ముద్దుపెట్టుకుంటూ అమితోత్సాహంతో మాట్లాడేస్తోంది సుందరి.

సుమ కళ్లు విప్పింది. నాన్నగారిని చూసింది. నవ్వింది. మళ్లీ కళ్లు మూసేసుకుంది.

"నాతో అబద్ధం ఎందుకు చెప్పావమ్మా. నాన్నారు చచ్చిపోయారా.. ..ఇంక రారా..... నన్ను ఎత్తుకోరా. ..పోనీలేమ్మా నీకు నేనున్నామగా... .."

అయోమయంగా చూస్తున్నాడు సత్యకీర్తి. అతనికేమీ అర్థంకాలేదు.

"నేను....మీ నాన్నను వచ్చానమ్మా" అన్నాడు.

సుమకు ఆ మాటలు వినిపించాయో లేదో......?

"నాన్నారు ఎప్పుడొస్తారమ్మా.....?"

ఆఖరిసారిగా అడుగుతూ పాప మరియిక మాట్లాల్లేదు.

నాన్నను గుర్తుచేసి అమ్మను ఇంకెప్పుడూ బాధపెట్టకూడదు అనుకుందో ఏమో......దూరంగా అందకుండా ఎవరికీ చెందకుండా వెళ్లిపోయింది.

"నాన్నారు వచ్చారమ్మా......" అన్న సుందరి పిచ్చికేకకు ప్రతిధ్వనిమ్మాతమే సమాధానంగా వచ్చింది. ●

రు10,000/-గెలుచుకోండి

144 రొక్కపు బహుమతులు !

కాల్గేట్ బేబీ పౌడర్ ఫోటోగ్రాఫుల పోటీ !

మీకు 1½ ఏళ్ల లోపుగా లేక 1½ ఏళ్లనుంచి 3 ఏళ్ల మధ్య వయస్సులో ఒక పాపాయి ఉందా? పాపాయిల ఫోటోలను యీ రెండు తరగతులలో దేనికైనా పంపండి. ప్రతి తరగతిలోను 72 రొక్కపు బహుమతులు యివ్వబడతాయి :

రు.1,000 మొదటి బహుమతి

రు. 500 రెండవ బహుమతి

ఇంకా, 70 కన్సొలేషన్ బహుమతులు ఒక్కొక్కటి రు. 50!

ఎలా పాల్గొనాలి ;

అది ఎంతో సులభము! మీరు యిలా చేయండి—

ఒక ఫోటోగ్రాఫు మీ పాపాయిది పై తరగతిలో ఉండేది పంపాలి

ఒక అమ్మివేయబడిన రొక్కపు రసీదు—కాల్గేట్ బేబీ పౌడరు యొక్క లార్జ్ లేక జయంట్ సైజు డబ్బా కొన్నట్లు చూపే రసీదు

ఒక ఎంట్రీ ఫారము—మీరు పౌడరు డబ్బా కొనే షాపులో లభిస్తోంది.

గెలుపొందుటకు ఎన్ని మంచి అవకాశములు! నేడే పాల్గొనండి!

ముగింపు తేదీ : 30వ జూన్, 1966.